ఈ వారం సరసం

# కొత్త కాపురం

— సూరేపల్లి విజయ



ఈ మహానగరంలో రూపాయి పెట్టినా ఎన్ని పూలు రావు. పూలతో సాయంత్రం శ్రీవారికి స్వాగతం చెప్పాలని మధ్యతరగతి రతి కోరిక. ఊళ్ళో వాళ్ళ ఇంట్లో వున్న సన్నజాజి పందిరికి ఎన్ని పూలో! పూలు పెట్టుకొమ్మని వాళ్ళమ్మ మాలకట్టిస్తే అప్పట్లో అంత శ్రద్ధ వుండేది కాదు. ఆమె భర్త రవితేజకు మల్లెపూలంటే చాలా ఇష్టం. అతను ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు మల్లెచెండు మూరెడైనా పట్టుకొస్తాడు. తెచ్చిన పూలను జడలో పెట్టి, ఎత్తుకొని, గిరగిరా తిప్పాలని ఆమె ఆశ. కాని వున్నవి రెండే రెండు ఇరుకు గదులు. అజాగ్రత్తగా ఎటు రెండడుగులు వేసినా ఏదో ఒకటి తగలడం ఖాయం. అందులో ఒకటి వంట గది. రెండోది అన్నిటికి. ఆ వంట గదిలోనే రాత్రికి రతి అత్తగారు పడుకుంటుంది. ఆవిడ పది దాటే వరకు గీతా పారాయణం చేస్తుంది. అప్పటివరకు అతను 'రతి' పారాయణం చేస్తూ కూర్చుంటాడు. భర్త విరహ బాధను చూసి ఆమె మనసులోనే నవ్వుకుంటుంది. ఆవిడ లైట్ తీసేయగానే మొదలవుతుంది వాళ్ళ అసంపూర్ణ ప్రేమాయణం. 'అసంపూర్ణ' అని ఎందుకంటున్నానంటే ఆవిడ ఎప్పుడూ నిద్రపోయినట్టనిపించదు. అటు యిటూ కదులుతుంది. ఆవిడ సన్నగా గురక పెడితే వాళ్ళకి కాస్తంత నిశ్చింత. అంతవరకు అతను భార్యను తనవైపు తిప్పుకోవటానికి ప్రయత్నిస్తుంటాడు. గురక వినపడగానే ఆమె 'వద్దంటూనే' భర్తవైపు తిరుగుతుంది.

అతను మాగ్నెట్‌లాగ ఆమెను అతుక్కుపోతాడు. ఇంతలో ఆవిడ వదులుతుంది. ఆమె అతని పట్టు విడిపించుకొని అటు తిరుగుతుంది. రోజూ ఇదే తంతు.

ప్రొద్దున్నే ఇంటి ముందున్న ఒక్క బండ ఊడ్చి, తుడిచి, దానిపై ముగ్గు పెడుతుంటే ఆమెకు తన పుట్టిల్లు గుర్తొచ్చింది. ఇంటి దగ్గర ఎంతో పెద్ద వాకిలి! తెల్లవారే సరికి వాకిలి నిండా పూలు రాలిపడి వుండేవి. మంచుకు తడిసిన ఆ పూల వాసన గమ్మత్తుగా వుండేది. ఆ పరిమళాన్ని ఆస్వాదిస్తూ నెమ్మదిగా తను వాకిలూడుస్తుంటే 'త్వరగా కానియ్' అని బామ్మ మొత్తుకునేది. ఆ పల్లెటూళ్ళో. విశాలమైన గదులతో మేడ, ఇంటి చుట్టూ బోలెడంత ఖాళీ స్థలం – ఎక్కడ వున్నా ఎంతో స్వేచ్ఛగా వుంటుంది. పట్టణంలోని ఈ గదులు తనకు జైళ్ళలా వున్నాయి. అందులో అత్తగారు – ఏకాంతమే కరవయింది. నిట్టూరుస్తూ లేచింది. త్వరగా వంట ముగించి అతనికి భోజనం వడ్డించింది. అతను ఆఫీసుకెళ్ళటానికి రెడీ అవుతుంటే, టిఫిన్ బాక్స్ తెచ్చి యిచ్చింది. అది అందుకుంటు 'మామూలు' అన్నట్టుగా ఆమె వైపు చూశాడు. 'అదొక్కటే తక్కువ' అన్నట్టు చూపులతోనే ఆమె సమాధానం. ఆమె డల్‌గా వుందని గ్రహించి "ఈరోజు సినిమాకెళ్దాం. రెడీగా వుండు" అని చెవిలో చెప్తున్నట్టుగా చెప్పి తన మామూలు తీసుకున్నాడు. భర్త చలాకితనానికి ముసిముసిగా నవ్వుకుంది.

** ** **

సెలవులో వెళ్ళిన శేఖర్ ఆరోజే డ్యూటీలో జాయిన్ అయ్యాడు. ఆఫీసులోకి అడుగుపెట్టిన రవితేజను చూడగానే అతను "హాయ్! ఎలా వుంది కొత్త కాపురం?" అంటు పలకరించాడు.

"గురుడు రోజుకెన్ని షోలేస్తున్నాడో – అడుగు" ఆత్రుతతో అన్నాడు పక్కనే వున్న మూర్తి.

"ఆ కళ్ళు చూస్తుంటే అసలు నిద్రపోయినట్టు లేదు" కామెంట్ చేశాడు ఎదురుగా వున్న ప్రసాద్.

"వాణ్ణి చెప్పనివ్వండి" మధ్యలో కల్పించుకున్నాడు శేఖర్.

ఏం చెప్పమంటావు?... రోజూ శివరాత్రే. జాగారం తప్పితే మరికేం లేదు.

"వ్వాట్!?"


"ఎందుకు!?"

"ఏమిటి కారణం?"

ముగ్గురూ ఒక్కసారిగా అడిగారు.

"రతితో పాటు మా అమ్మ వచ్చింది. కొత్త కోడలికి వంట వార్పు నేర్పాలని, ఇల్లంతా చక్కగా సర్దిపోవాలని. రెండు గదుల ఇంటికే వెయ్యి రూపాయల అద్దె చెల్లిస్తున్నాను. ఈ గుమస్తా ఉద్యోగానికి అంతకంటే పెద్ద ఇల్లు ఎలా వస్తుంది? ఒక గదిలో మేము, ఇంకో గదిలో మా అమ్మ పడుకుంటాము. రాత్రంతా ఆమె నిద్రపోదు. ఊరికే మెసులుతుంది. ఆమె నిద్రపోనిదే రతి ఒప్పుకోదు. అదీ ప్రాబ్లం."

"రెండు గదుల మధ్య తలుపులేదా?" అడిగాడు



## గాయకుడిని అయ్యేవాడినేమో!

'గళాన్ని పరీక్షించుకోవాలని వువ్విళ్ళూరుతుండే వాడిని. కాని ఇంత స్పీడుగా కలాన్ని పరుగులు తీయిస్తానని ఊహించలేదు' అని ఇప్పటిదాకా హిందీ సినిమాల్లో నాలుగువేల పాటలు రాసిన విఖ్యాత సినీగేయ రచయిత ఆనంద్ భక్షి చెప్పారు. నేను సినీ కవిని కాకముందు రేడియోకి చెవులప్పగించి పాటలు వింటూ వుండేవాడిని. గొప్ప గాయకుడిని అవుదామని కలలు కంటూ వుండే వాడిని అని ఇటీవలెనే అరవైఎనిమిదో పడిలో పడ్డ భక్షి గతాన్ని నెమరు వేసుకున్నారు. పాటలు రాయడంలో క్లిక్ అయ్యి వుండకపోతే గాయకుడిని అయివుండేవాడినేమో! అని చెప్పారు.

శేఖర్.

"ఉంది. తలుపు వేస్తాము. కాని కిటికీ తెరిచే వుంటుంది. అది కూడా మూసేస్తే మా అమ్మ 'గాలాడి చావట్లేదురా' అంటుంది."

"అయితే మీరే లోపలి గదిలో పడుకోండి?"

"ఇది నీవు చెప్పాలా? ఆ మాత్రం వాళ్ళకూ తెలుసు. అలా వీలు కాదేమో! బహుశ లోపలి గది చాలా చిన్నదయుంటుంది" పరిస్థితిని అర్థం చేసుకున్న వాడిలా చెప్పాడు మూర్తి.

"అవును కరెక్టుగా చెప్పావు."

"నువ్వేమనుకోనంటే నేనోటి చెప్పనా? రోజూ మీ అమ్మకో నిద్ర మాత్ర ఇవ్వు" సందేహిస్తూ సలహా ఇచ్చాడు ప్రసాద్.

అతని వైపు కోపంగా చూశాడు రవితేజ.

నాలిక్కరుచుకున్నాడు ప్రసాద్.

"అందుకే హనీమూన్ వెళ్ళాలంటారు" అన్నాడు మూర్తి.

"ప్రస్తుతానికి రేపెలాగూ ఆదివారం కనుక, ఏదైనా హోటల్‌లో రూం తీసుకొని ఎంజాయ్ చెయ్యండి" అన్నాడు శేఖర్.

"ఐడియా బాగుంది. కాని జేబులు ఖాళీ. మీలో ఎవరైనా ఒక ఐదొందలు అప్పిస్తా..." అంటూ నసిగాడు రవితేజ.

"సరే ఈ ఐదొందలు తీసుకో. వడ్డీతో సహా ఫస్ట్‌కి తిరిగిచ్చెయ్యాలి."

"అలాగే, తప్పకుండా, థాంక్యూ వెరీ మచ్" అంటూ శేఖర్ చేతిలోంచి మనీ తీసుకున్నాడు. ఎలాగూ పార్టీ అడుగుతారని తెలిసి అటెండర్‌ని పిలిచి టీ, స్నాక్స్‌కు ఆర్డరిస్తుంటే ఎవరి సీట్లలో వాళ్ళు సర్దుకున్నారు.

** ** **

సినిమా కోసం ముస్తాబవుతోంది రతి. అది చూసి అత్తగారు "అమ్మాయి, తయారవుతున్నావు ఎక్కడికి?"

"సినిమా కత్తయ్యా"

"మొన్ననే కదా వెళ్ళారు!"

"నేనొద్దన్నానత్తయ్యా, కాని మీ అబ్బాయే..."

"వాడలాగే అంటాడు, నువ్వైనా చెప్పొద్దు... ఇలా సినిమాలకి, షికార్లకి తగలేస్తుంటే, నాలుగు డబ్బులు వెనకేసుకునేదెప్పుడు?"

"మొదలెట్టింది భారతం – కొత్తగా పెళ్ళయింది, ఏదో సరదాపడుతున్నారు పిల్లలు అనుకోదు." 'నువ్వూ రా అత్తయ్యా' అంటే ఎగిరి గంతేస్తుంది గొణుక్కున్నట్టుగా అంది రతి.

"ఈ కాలవు పిల్లలు... మాట వింటారా? ఊహు!"

ఈల వేసుకుంటూ లోపలికి అడుగుపెట్టాడు రవితేజ. అతని రాకతో రిలీఫ్ ఫీలయ్యింది రతి. అతను ఆమెను సమీపించి "త్వరగా కాఫీ ఇవ్వు. టైమవుతోంది, వెళ్దాం" అంటూ ఆమె బుగ్గమీద చిటికేశాడు.

భర్త హుషారును గమనించింది. కాని ఆ హుషారెందుకో అర్థం కాలేదు. అడుగుదామంటే అత్తగారుంది. తరువాత చెప్తాడులే అనుకుంది. అతను తయారవగానే కాఫీ యిచ్చింది. కాఫీ తాగి ఇద్దరూ బయలుదేరారు.

ఆటో కోసం చూస్తూ "ఏ సినిమా కెళ్దాం?" అడిగాడు.

"ఏదైనా పాత సినిమా కెళ్దామండి"

"పాత సినిమాకా! ఎందుకు?"

"పాత సినిమాకయితే హాల్లో జనం వుండరు. హాయిగా ఏమూలైనా కూర్చోవచ్చు. అక్కడయినా కాస్త ఏకాంతం దొరుకుతుంది."

"ఆహా! వాట్ ఎ గుడ్ ఐడియా" అంటూ శ్రీమతిని నెమ్మదిగా వెనక గిల్లాడు.

"ఊరుకోండి రోడ్డు మీద అందరూ చూస్తారు" అంటూ వారించింది శ్రీవారిని.

ఖాళీ ఆటో రావడంతో ఎక్కి సినిమా హాలు చేరుకున్నారు. బాల్కనీ టికెట్ తీసుకొని లోనికెళ్ళారు. సినిమా మొదలయింది. వాళ్ళిద్దరూ తప్ప ఎవరూ లేరు. ఆ బాల్కనిలో అతని చిలిపి మాటలకు, చేతలకు హద్దే లేకుండా పోయింది. అప్పుడే సినిమా అయిపోయిందా అనిపించింది వాళ్ళకి. ఇంటికి తిరిగి వస్తూ మధ్యలో


"ఉదయమే మనం బయటికి వెళ్తున్నాం. ఏమీ మాట్లాడకుండా నాతో బయలుదేరు" అన్నాడు అతను.

"ఎక్కడికి? ఫ్రెండ్ ఇంటికా?" అడిగింది ఆమె.

"అవును" కాదంటే యక్ష ప్రశ్నలు వేస్తుందని అలా చెప్పాడు.

** ** **

మామూలుగా అయితే ఆదివారం ఉదయం



"ఎనిమిది కంటే ముందు లేచేవాడు కాదు రవితేజ. కాని ఆరోజు అతనిలోని బయలాజికల్ క్లాక్ అతన్ని ఆరింటికే లేపింది.

అతనైతే త్వరగా తయారయి కూర్చున్నాడు. కాని రతి తెమలొాదూ!

టిఫిన్ చేస్తూ అతను వాళ్ళమ్మతో "అమ్మా ఈరోజు రతి, నేను కలిసి మా ఫ్రెండ్ ఇంటికి భోజనానికి వెళ్తున్నాము. సాయంత్రానికి వచ్చేస్తాం. వాళ్ళు వుండమని మరీ బలవంతం చేస్తే రేప్పొద్దున్నే వస్తాము" అని చెప్పాడు.

"అలాగే, వెళ్ళండి" అంది వాళ్ళమ్మ.

"హమ్మయ్య" అనుకుంది రతి.

"ఇల్లు జాగ్రత్త. తలుపులు తీసిపెట్టి పక్కింటి కెళ్ళి కబుర్లలో పడకు" అని అమ్మతో చెప్పి "త్వరగా తెమలవోయ్! అంటూ రతిని పురమాయించాడు.

"అయిపోయిందండి ఒక్క నిమిషంలో చీర మార్చేసుకోని వచ్చేస్తాను. మీరలా కాసేపు బయట నిలబడతారా."

"ఓ.కె. ఈలోగా నే వెళ్ళి పూలు తెస్తాను" అంటూ బైటకెళ్ళాడు. అతను తిరిగి వచ్చేసరికి ఆమె కొత్త చీరలో 'రతీదేవి'లా దర్శనమిచ్చింది. తలక పోసుకుంది కాబోలు – కురులన్నీ విచ్చు కున్నాయి. వదులుగ అల్లిన ఆమె జడలో తెచ్చిన మల్లెచెండు పెట్టి అలాగే తన్మయత్వంతో చూస్తు న్నాడు. సెలయేటి ఎదురుగా నిలబడి మంచినీటి కోసం పరితపిస్తున్న వాడిలా వుంది అతని పరిస్థితి. "పదండి" అని ఆమె అనడంతో కదిలాడు.

ఆటో ఎక్కి 'మయూర లాడ్జి' అని చెప్పాడు డ్రైవరుతో. దానికి దగ్గరలో వాళ్ళ ఫ్రెండు ఇల్లు వుందేమో అనుకుంది రతి. మాట్లాడకుండా ఆటో ఎక్కింది.

ఆటో దిగుతూ 'ఫ్రెండు ఇంటికని చెప్పి లాడ్జికి తీసుకొచ్చాడు!' అనుకుంది. ఆటో ఛార్జిచ్చేసి గబగబా రిసెప్షన్ వైపు నడుస్తున్నాడు అతను. అయోమయంగా అతని వెనకాలే నడిచింది ఆమె. వేరే ఊరు నుంచి విజిటింగ్ పర్పస్‌లో వచ్చినట్టు రిజిస్టరులో వ్రాసి అడ్వాన్సు పేచేశాడు. రూం కీ బోయ్‌కిస్తూ "లగేజి ఇతనికివ్వండి... తీసికెళ్తాడు" అంది లేడీ రిసెప్షనిస్టు. 'లగేజి' అనగానే ఇద్దరూ మొఖాలు చూసుకున్నారు. వెంటనే తేరుకొని "లగేజి లేదు" అన్నాడు అతను. వాళ్ళ వైపు అనుమానంగా చూసింది రిసెప్షనిస్టు. బాయ్ వాళ్ళను రూంకు తీసుకెళ్ళి, జగ్‌తో డ్రింకింగ్ వాటర్ తెచ్చి టేబుల్‌పై పెట్టాడు.

"కాఫీ... టిఫిన్... ఏమైనా కావాలా సార్?" అని అడిగితే వద్దని చెప్పి వాణ్ని బైటికి పంపి తలుపు బోల్ట్ వేసి గట్టిగా ఊపిరి పీల్చాడు అతను.

ఆమెకి ఆ లాడ్జ్ వాతావరణం అంతా కొత్తగా వుంది. కొంచెం భయంగాను వుంది. వచ్చి బెడ్‌మీద కూర్చుంది. పరువు మెత్తగా, హాయిగా వుంది.

"ఉండదూ – రొండొందలు తగలేస్తే!" రిసెప్ష న్‌లో అతను రెండొందలివ్వడం చూసింది. అంత లోనే అది గుర్తొచ్చి ఆమెలో ఏదో బాధ. ఫ్రెండ్ ఇంటికని అబద్ధం చెప్పి లాడ్జికి తీసుకొచ్చిన భర్తను చూస్తుంటే అతనిపై కోపం.

ఆమె కళ్ళెదుట – లాడ్జి – మెత్తటి పరుపు – రెండొందలు – రవితేజ.

ఆమెలో భయం – హాయి – బాధ – కోపం. దగ్గరగా వస్తున్న అతనిని చూస్తూ "ఏంటండీ, ఈ తిప్పలు. ఎందుకు తీసుకొచ్చిరాక్కడికి?" గట్టిగానే అడిగింది.

గట్టిగా అరవకు అంటూ ఆమెను లాక్కొని తన పెదాలతో ఆమె నోటిని మూసేశాడు. అతని చేతులు 'రతి' వీణను శృతిచేశాయి. అతను మన్మధరాగం పలికిసతఉన్న వేళ – టక్, టక్... టక్, టక్... మని తలుపు చప్పుడు. గాభరాగా లేచి ఇద్దరూ సర్దుకున్నారు. అతను వెళ్ళి తలుపు తీశాడు. ఎదురుగా ఇద్దరు పోలీసులు. వాళ్ళను చూడగానే ఇద్దరూ డీలాపడ్డారు.

"ఎక్కడ పట్టుకొచ్చావు దీన్ని... పద పోలీసు స్టేషన్‌కి" అన్నాడు వాళ్ళలో ఒకడు.

"మేమిద్దరం భార్యా భర్తలం" అతను.

"కావాలంటే నా మంగళ సూత్రం చూడండి" అమె.

"లేచొచ్చిన ప్రతి జంట చెప్పే మాటలే ఇవి... మాకేం కొత్త కాదు. పదండి..."

"మీ లగేజేది?" అడిగాడు ఇంకో పోలీసు.

"లేదు. మేం సిటీ చూడటానికొచ్చాం. ప్రొద్దున్నే వెళ్ళిపోతాం" వాళ్ళని కన్విన్స్ చేయబోయాడు.

"లగేజి లేదంటే... ఖచ్చితంగా లేచొచ్చిన బాపతే. మాట్లాడకుండా పద పోలీసు స్టేషన్‌కి" అంటూ అతనిని కర్రతో బైటికి నెడుతున్నాడు మొదటి పోలీసు.

"చూస్తావేం... నడూ..." అంటూ ఆమెని గదమాయించాడు రెండో పోలీసు.

ఆమె కన్నీళ్ళతో ఎంత వేడుకున్నా వాళ్ళు వినలేదు. లాడ్జిల మీద పోలీసులు రైడ్ చేస్తుంటారని అతనికి తెలుసు. కాని అది తనదాకా వస్తుందని ఊహించలేదు. ఎక్కువ మాట్లాడితే పోలీసులు వాళ్ళ లాంగ్వేజిలోకి దిగి లాఠీ ఝళిపిస్తారని గ్రహించి అతను మారు మాట్లాడలేదు.

పోలీసులు – వాళ్ళను స్టేషన్‌కు తీసుకెళ్ళారు. కేసు బుక్ చేస్తామన్నారు. రేపు కోర్టులో హాజరు కావాలన్నారు. అంతవరకు లాకప్‌లో వేస్తామన్నారు.

అతను అసలు విషయం చెప్పి, వదిలిపెట్టమని ప్రాధేయపడ్డాడు. ఆఖరికి ఐదొందలిస్తే వదిలేస్తామ న్నారు.

అతను తన జేబులో వున్న రెండు వందల యాభై రూపాయలు, ఇంకా కొంత చిల్లర తీసి టేబుల్ మీద పెట్టాడు. అంతకంటే ఎక్కువ ఒక్క పైసా కూడా జేబులో లేదన్నాడు. కావాలంటే రేపు ఆఫీసుకొచ్చి తక్కువైన డబ్బు తీసుకోమన్నాడు. ఆఫీసడ్రసు రాసిచ్చాడు.

ఎట్టకేలకు – పోలీసులు వాళ్ళను కనికరించారు. రెండు వందల యాభై రూపాయలు జేబులో కుక్కుకొని, ఇంటికెళ్ళడానికి మిగిలిన చిల్లర వాళ్ళ నుంచుకొమ్మన్నారు.

'బ్రతుకుజీవుడా!' అనుకొని బయటపడ్డారు.

'అన్నిటికన్నా ఇల్లే పదిలం' అనుకుంటూ ఇల్లు చేరారు.



## రెండున్నర లక్షలు ఎగ్గొట్టిన మహిమ

ఇప్పటి హీరో, హీరోయిన్లందరూ దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే సామెతని బాగా ఒంటబట్టించుకుంటున్నారు. సరిగ్గా అదే బాటలో పయనిస్తూ రాకేష్ మల్హోత్రా, సాజిద్ నడియాద్ వాలా, రాజ్, కన్వర్‌లనే ఈ ముగ్గురి నిర్మాతలకి ఒకే డేటిచ్చేసి అడ్వాన్స్ పుచ్చేసుకుందిట మహిమ. గోవిందా హీరోగా మారిషస్‌లో షూటింగ్ పెట్టుకుని రాకేష్ ఫోన్‌చేస్తే ఖాళీ లేదు, తర్వాత పెట్టుకొమ్మని చెప్పిందట! దాంతో చిర్రెత్తుకొచ్చి మహిమాని తీసేసి రాణీ ముఖర్జీతో షూటింగ్ కానిచ్చేస్తూ అడ్వాన్స్ తిరిగి ఇమ్మని ఫోన్‌లు చేస్తుంటే వుండీ లేనని చెప్పిస్తోందట బ్రతకనేర్చిన ఈ రామ చిలక.